# సంస్కారముల పుణ్య పరంపర

## Samskaramula Punya Parampara
**(Telugu)**

*హిందీ మూలము :*
నవయుగ నిర్మాణ యోజనారూపశిల్పి
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామశర్మ ఆచార్య**

*ఆంధ్రానుసరణము :*
ధార్మిక వాగ్భూషణ
**కె.బి. సోమయాజులు**

*ప్రచురణ :*
**గాయత్రి చేతన కేంద్రం**
అశ్విని హౌస్ వెనుక, హెచ్.పి.రోడ్,
మూసాపేట, హైదరాబాదు - 500 018.
ఫోన్ : 040-23700722, 09392506888
E-mail: gckhyderabad@yahoo.com

Book Name :
**Samskaramula Punya Parampara**

**Language :** Telugu

**Book Code :** TL119

**Author :**
Yugarishi Vedmoorti Taponishtha
Pandit Sriram Sharma Acharya

**Translated by :**
Sri K.B. Somayajulu, Kurnool

**Edition :** 2nd

**Month & Year :** August, 2009

**Copies :** 5,000

**Price :** Rs. 6-00

**Publishers :**
Yugnirman Yojana Press
Gayatri Taphobhoomi, Mathura - 281003 (U.P.)
Ph: 0565-2530128, 2530399

**Zonal Office :**
Gayatri Chetna Kendra,
Near Aswini House, Bharat Nagar Bus Stand, H.P. Road, Moosapet,
Hyderabad - 500 018 (A.P.) E-mail : gckhyderabad@yahoo.com
Ph : 040-23700722, 09392506888, Fax : 040-23703430

**Andhra Pradesh Centres :**
Gayatri Shakti Peeth, Narakoduru. Ph : 0863-2534440, 9949111175
Yug Shakti Gayatri Kendra, Vijayawada. Ph : 0866-6616570, 9394863262
Yug Shakti Gayatri Kendra, Vizag. Ph : 9393105427, 9949173022
Gayatri Pragya Peeth, Goshamahal, Hyd. Ph : 040-24617643, 9393002165

**Head Office :**
Gayatri Teerth, Shantikunj,
Haridwar, Uttarakhand - 249411
Ph: 01334-260602, 260403, Fax : 01334-260866
E-mail : south@awap.org Website : www.awgp.org www.dsvv.org



# సంస్కారముల యొక్క పుణ్య పరంపర

మానవజాతి యొక్క సుఖశాంతుల అభివృద్ధికి సత్ప్రవర్తననే ముఖ్యమని తత్త్వదర్శులైన మన పూర్వ ఋషులు తలంచెడివారు. అందుకొరకయి వారు తీవ్ర ప్రయత్నాలు కూడ చేశారు.

తమ అమూల్య జీవితాలను సత్ప్రవర్తనను సాధించడానికి వెచ్చించారు. వారు చేబట్టిన ఈ పవిత్రకార్యాన్ని సంస్కృతీ నిర్మాణమని పేర్కొనుట ఉచితం. మన ధార్మిక సాహిత్యమంతా ఇందుకే రచించబడింది. యోగాభ్యాసం, ఈశ్వరుడు, ఉపాసన, తపశ్చర్య, సంయమం, సదాచారం, వ్రతోపవాసాలు, తీర్థయాత్ర, దైవదర్శనం, దానపుణ్యాలు, కథాప్రవచనం, యజ్ఞానుష్ఠానములు మొదలైనవెన్నో ధార్మిక విషయాలు మనకు కనిపించినా, వాటి ప్రయోజనమొక్కటే - అది - మనిషిని నిర్మలుడు, ఉదారుడు, సద్గుణవంతుడు, సంయమవంతుడు, పరమార్థపరాయణుడుగా తీర్చిదిద్దవలెనన్నది. ఇందుకెట్టి యున్నత భావములు కావలెనో వాటినొక క్రమపద్ధతిలో నేర్పాటు చేయుటకు పైన తెలిపిన కార్యపద్ధతి ద్వారా సాధ్యమగును. ఈ విధమైన ధార్మిక ప్రయోజనములను సాధించుటకు జరుపబడు కృషి మన చైతన్యయుత జీవనమును పవిత్రము, వికసితము, లోకోపకారకముగా చేయుటకుపరించును.

## భూమిని స్వర్గముగా తీర్చిదిద్దగల మునుల ప్రణాళిక

ఋషులు కేవలము శాస్త్రములను రచించుట, ధర్మమునకు సంబంధించిన విధినిషేధముల నమలు చేయుట వరకు తమ కర్తవ్యమని భావించక, తామిచ్చిన ప్రేరణ స్థిరముగను, అన్నిటికిని అగ్రగామిగా నుంచుటకు నిరంతరము కఠోరశ్రమ చేయవలయునని, తమ శక్తి సామర్ధ్యములను యీ

పవిత్ర ప్రయోజనసాధనకే యుపయోగించవలెనని భావించి అమలులో పెట్టినారు. జనులందరి జీవితములలో సజీవము, సువికసితమునైన ధార్మిక చైతన్యమును కలిగించుటయే తమ జీవన ధ్యేయముగాను, అతిముఖ్యమైన బాధ్యతగా భావించి వారు జీవించినారు. నిరంతర ప్రవచన ప్రబోధముల ద్వారా ధార్మిక విషయములలో ప్రజలు సుశిక్షితులగునట్లు, దానికి తోడు ధర్మము తగిన పద్ధతిలో వికసించుటకు అనేక నిర్మాణాత్మక కార్యక్రమములను చేబట్టినారు. తమ జీవితములకు కావలసిన రక్షణ, ఏకాగ్రతల కొరకు స్వాధ్యాయ, ఉపాసన, తపశ్చర్య, పశుపాలన, కృషి వంటి పనులు చేబట్టెడివారు. కానీ యివి కేవలము శరీరయాత్ర కొనసాగుటకు చేబట్టినవి మాత్రమే. వారి లక్ష్యము జనజాగరణయే! జనజాగరణయనగా ప్రతి వ్యక్తి యొక్క అంతఃకరణలో ధార్మిక భావనలను జాగృతమొనరించుట, ఆదర్శమునెడ దృఢత్వము, ఆ దిశలో ముందుకు సాగుచున్న పురుషుని మానవ జాతిరత్నముగా తీర్చిదిద్దవలెనన్న యుత్సాహ, సాహసములు. బ్రాహ్మణులు, సాధుసత్పురుషులు జనమానసములలో నీ విధమైన సత్ప్రవృత్తులను మేల్కొలుపుటకు, వాటిని పెంపొందించుటకు ప్రయత్నించెడివారు. ఇవే వారి జీవన పరమార్ధముగాను, ఆశయముగా నుండెడివి.

బ్రాహ్మణుని యొక్క త్యాగ సమర్పణలతో నిండిన యీ సత్ప్రయత్నమెంత వరకు కొనసాగినదో అంతవరకు ఈ దేశములో సుఖశాంతుల అమృత ప్రవాహము ప్రవహించుచు శీతల మంద సుగంధ మలయ సమీరము వీచుచుండెడిది. దానితో ప్రపంచమంతయూ తనను తాను ధన్యమయినదిగా భావించెడిది. కాని నేడు అందుకు భిన్నమైన పరిస్థితులేర్పడినవి. దురదృష్టము బ్రాహ్మణుల యొక్కయు సాధు సత్పురుషుల యొక్కయు లక్ష్యములను కూడా తారుమారు చేసివేసినది. వారు తమ వ్యక్తిగత సమృద్ధి, సిద్ధులను సంపాదించవలెనను కోరికతో లుబ్ధులైనారు. కాని పాపము వారికేమి లభించినది?



## సర్వశ్రేష్ఠ పరంపర

మానవ కళ్యాణమునకై మహోన్నతమైన పరంపరలలో ఎన్ని ఏర్పాట్లు అనుష్ఠానములున్నచో వాటన్నిటి కంటె ప్రముఖమైన స్థానము, సంస్కారములు, పర్వములదే! సంస్కారములు, ధర్మానుష్ఠానముల ద్వారా వ్యక్తిని, అతని కుటుంబమును, అదే విధముగా పండుగలూ పబ్బముల సహాయముతో సమగ్ర సమాజమునూ సుశిక్షితమొనరింపవచ్చును. ఈ పుణ్య పరంపరను గురించి ఎంత విశాలముగ ఆలోచించి ప్రాధాన్యతను ఇచ్చెదమో అంతగా వాటి మహత్యము, ఉపయోగములు తెలియగలవు. పండుగలు పబ్బముల చర్చ మరియొకచోట చేసెదము. ఇక్కడ షోడశ సంస్కారముల ఉపయోగము, వాటి ఆవశ్యకతలపై కొంత ఆలోచించెదము.

ఈ స్వాధ్యాయ సత్సంగ ప్రశిక్షణలు, చింతన, మననము మొదలైన వాని యొక్క ప్రభావము మనిషి మనస్సుపై పడును. అవి వ్యక్తి యొక్క భావములు వికసించుటకు సహాయపడును. తద్వారా వాటి ఉపయోగములను గ్రహించి సర్వత్రా ఆచరించుట జరుగును. ఐతే ఇక్కడ దృష్టిలో పెట్టుకొనవలసిన మాటయొకటున్నది. అంతఃచేతనను ఉత్సాహవంతము, సూక్ష్మతమముగా రూపొందించుటకు కొన్ని వైజ్ఞానికములైన సాధనములున్నవి. వాటి మహాత్మ్యము నేటి స్వాధ్యాయ సత్సంగాది సాధనముల కన్న తక్కువ కాదు. ఈ విధమైన వ్యక్తి నిర్మాణమునకు వైజ్ఞానికములైన సాధనములే "సంస్కారములు" అని పిలువబడుతవి. మధ్యమస్థాయి మనుష్యులను కూడా సంస్కరించి అందరి కన్నా ఉత్తమునిగా చేయుటకు సులభమైన సాధనము సంస్కారము. సంస్కారముల వలన వ్యక్తిగత, పారివారిక, సామాజిక జీవనములలో శ్రేయస్కర మంగళప్రద సిద్ధుడుగా వ్యక్తి తయారుకాగలడని వేరుగా చెప్పనక్కరలేదు.

## విజ్ఞాన సమ్మత ప్రక్రియ

జీవుడు గర్భములో ప్రవేశించినది మొదలు జీవనయానములోని వివిధ పరిస్థితులలో ముందుకు సాగుచు శరీరము విడుచువరకు గల అనేక

సమయములలో సంస్కారములను నిర్వహించుటకు మన ధర్మశాస్త్రములలో విధానములున్నవి. వీటి వలన వ్యక్తి యొక్క అంతఃకరణ మీద విశేష ప్రభావము పడును. తద్వారా ఆ వ్యక్తిని ఉత్తమ సంస్కారిని చేయుటకు సులువుగా వీలగును. వివిధ సందర్భాలలో ఉపయోగించు శక్తిసంపన్నమైన వేదమంత్రములలో విశిష్టమైన శక్తి యున్నది. విధి విధానములో సస్వరముగా ఉచ్చరించుట వలన ఆకాశములో ఒక ప్రత్యేక విద్యుత్ప్రవాహము తరంగితమగు వైజ్ఞానిక పద్ధతి ఆ మంత్రములలో ఏర్పాటు చేయబడినది. వాటి వలన, ఆయా మంత్రముల యొక్క శక్తిసుప్రసిద్ధమైనదే. కావున దానిని గురించి ప్రత్యేకముగా వక్కాణించవలసినదేమున్నది? వేదశబ్దముల సూక్ష్మములను వైజ్ఞానికులు లెక్కలేనన్ని ప్రయోగములు, పరీక్షల ద్వారా పూర్వకాలములోనే తెలుసుకొనగలిగినారు. ఏఏ శబ్దముల మేళవింపు చేయవలెనో, వాటిని ఎట్లు ఉచ్చరించవలెనో, తద్వారా ఆ శబ్ద ప్రవాహము నిరంతరమెట్లు సాగునో, ఆ శబ్దములను వినువారిపైన ఎట్టి ప్రభావముండునో, వాటిని ఎందుకొరకుచ్చరించుట జరుగుచున్నదో, అది ఏవిధముగా సాధింపబడునో మొదలగు విషయములను వారు కనుగొనిరి. ఈ విధమైన నిష్కర్షలపై ఆధారపడియే వేదమంత్రములు తయారైనవి. అంతేకాక ఆయా మంత్రములు ఏ ప్రయోజనముల కొరకు నిర్దేశింపబడినవో వాటి నిర్ధారణకై గృహ్య సూత్రములు, వాటిలో వివిధ కర్మకాండలు, వాటి ప్రయోజనము తెలుపబడినవి. వివిధ ధర్మశాస్త్ర గ్రంథములన్నియూ అదే విధముగా విరచించబడినవి. యజ్ఞములలో ఈ మంత్రముల యొక్క శక్తి మరీ అధికముగా నుండును. ఆహుతులిచ్చు వారిపై ఆ మంత్రసిద్ధి యొక్క ప్రభావము పడును. విద్యుత్తు, ఆవిరి, అణువు, రసాయనము, పదార్థ విజ్ఞానము మొదలైనవన్నియునూ మన విజ్ఞానమే. అదే విధముగా మంత్ర శాస్త్రము, యజ్ఞాది కర్మకాండలు కూడ మన విజ్ఞానమునకు సంబంధించినవే. వీటిని సరిగా ఉపయోగించని వారిపై ఒక దుష్ట ప్రభావము పడును. వ్యక్తిని సంస్కరించుటకు సంస్కారములు, అందలి కార్యకలాపములు అత్యధిక ఫలవంతములు. వాటిని చూచి నేడు కూడ ఆశ్చర్యచకితులు కావలసినదే.



## ఉత్కృష్టమైన మానసిక చికిత్సా పద్ధతి

ఆయుర్వేద విజ్ఞాని అభ్రకము మొదలైన సామాన్య పదార్థములను అగ్ని సంస్కారమొనరించి మకరధ్వజము వంటి మిక్కిలి విలువైన రసాయనములను తయారుచేసినట్లుగానే షోడశసంస్కారములను మనుష్యుని మీద పదహారు మారులు ప్రయోగించి భారతీయ ధర్మానుగామిని ఉత్తమ సంస్కారిగా తయారుచేయుట జరుగును. ఇచట వైజ్ఞానికమైన అద్భుతమున్నది. నేటివరకూ శరీరమునకు సంబంధించిన దుర్బలతలను, రుగ్మతలను నివారించుటకై ఎంతో అన్వేషణ జరిగినది. ఆయుర్వేదము, హోమియోపతీ, యునానీ, ఎలోపతీ, నేచరోపతీ మొదలైన చికిత్సాపద్ధతులు శారీరకమైన కష్టములను మాత్రమే దూరము చేయగలవు. నేడు మానసిక రోగుల చికిత్సకై మానసిక వైద్యశాలలో ఒక విధమైన అరకొర అయినది. పరిశీలనాత్మకము అయిన వ్యవస్థ నడుచుచున్నది. అయితే అన్నిటికన్నా అతి అవసరమైనది మనుష్యుని యొక్క మానసిక వికృతుల దుర్బలతల యొక్క నివారణ. వీటివలననే మానవజాతి అన్నిటికన్నా అధికమైన కష్టము అనుభవించవలసి వచ్చుచున్నది. ప్రగతిపథంలో అనేక అడ్డంకులు కలిగించేవి ఈ మానసిక వికృతులే కాని వీటి నివారణకు ఏవిధమైన ఉపాయము గాని చికిత్సా పద్ధతిగాని నేటి వరకూ అన్వేషింపబడలేదు, అందలేదు. వ్యామోహులు, కోపిష్ఠులు, వంకలు వెదుకువారు, లోభులు, నిత్యశంకితులు, అవిశ్వాసము కలవారు, తెలివిలేనివారు, దయలేనివారు, స్వార్థపరులు, కఠినులు, కాముకులు, దురలవాట్లు కలవారు, చంచల స్వభావులు, అపసవ్యపు మనుష్యులు, ఉద్విగ్నులు, ఆవేశపరులు, స్థిరచిత్తము లేనివారు, ఊహలలో తేలువారు, అంధవిశ్వాసము కలవారు, దురాగ్రహులు, విశృంఖల ప్రవృత్తి కలవారు, దురభిమానులు, దుస్సాహసము కలవారు, అతివాదులు, కోతలరాయిళ్ళు, ఈర్ష్యాళువులు, అహంకారులు మానవ సమాజంలో తక్కువగా లేరు. ఈ మనోవికారములు వాస్తవమునకు చిన్నపాటి మానసిక రోగ లక్షణములే. శరీరంలో అనేక రోగాలను సహించడం తప్ప మంచం పట్టవలసిన అవసరము లేదో అదే విధంగా మనస్సుకు కూడా అనేక రుగ్మతలుంటాయి. వాటి ప్రభావము

వలన మనిషి సగము పిచ్చివాని స్థితికి జేరతాడు. అవి పరిశీలిస్తే సామాన్యశ్రేణికి చెందిన రుగ్మతలే అనిపించును. **అవి ఉన్నవానిలో పిచ్చివాని లక్షణములేవియూ కనిపించవు. సంస్కారరహితుడు సాధారణంగా సగం పిచ్చివాని స్థితిలోనే ఉండును.** వారు తమ అలవాట్ల కారణంగా తోటివారిని, బంధువులను ఎంతో ఇబ్బంది పెట్టెదరు. వారి వలన అందరూ, ఖిన్నులు, అసంతుష్టులూ అగుదురు. అట్టివారిలో ఏదైన గొప్ప కార్యమును చేయగల ప్రతిభ నశించును. ఇట్టి స్థితిలో వారు అత్యున్నత సాఫల్యతను పొందగలరు అన్న ఆశగానీ, అవకాశం గానీ సుతరామూ ఉండదు. బతికినంత కాలము ఏదో విధంగా కాలం గడపడమన్నదే వారికి చాలా గొప్ప విషయము అవుతోంది. ఈ విధమైన మానసిక అస్తవ్యస్థితి మనుష్యునికి ఉన్న ఒక గొప్ప దౌర్భాగ్యము. ఈ దౌర్భాగ్యాన్ని నివారించటానికి ఈ భౌతిక జగత్తులో చెప్పుకోదగిన ప్రయత్నమేమీ జరగలేదు అన్నది అత్యంత చింతనీయము. ఈ దిశలో జరిగిన కొద్దిపాటి ప్రయత్నములలో ఏ యొక్కటీ ఫలించలేదు అని చెప్పవచ్చును.

## వ్యక్తి నిర్మాణానికి ఉపయోగపడు సాధనము

ఈ అతిముఖ్యమైన సమస్యపై ఋషులు అత్యధిక ఏకాగ్రతతో ఆలోచించినారు. మానవుల మనస్సును ఒక విశిష్ట వైజ్ఞానిక పద్ధతి ఆధారంగా నిర్మలము, సంతులితము, సంస్కారయుక్తముగా నిర్మించుటకు ఉపాయమును కూడా అన్వేషించి సాధించినారు. దానికే సంస్కార పద్ధతి అని పేరు. ఆయా సమయములలో చేయు సంస్కారములు, ఉపచారములు మానవుని మనోవికారములను అదుపు చేసి సత్ప్రవృత్తులను వికసింపచేసి వ్యక్తిత్వమును తీర్చిదిద్దునట్లుగా నిర్మించగలవు. జీవితాంతము పనికి రాగల సత్ప్రవృత్తులకు చెందిన బీజములు ఈ సంస్కారముల సమయంలో నాటబడును. ఏ పిల్లవానికైనను సరియైన పద్ధతిలో సముచిత వాతావరణంలో అన్ని సంస్కారములు నిర్వహింపబడినచో అతని జీవితము ఆనందమయము, ప్రతిభావంతము, ప్రగతిశీలము, సాఫల్యములతో నిండినదిగా రూపొందించుట



పూర్తిగా సాధ్యము. **సంస్కార పద్ధతిని మానసిక వికారములను తొలగించు ఒక విధమైన విజ్ఞాన సమ్మత చికిత్సా ప్రణాళిక అనవచ్చును. వ్యక్తిత్వమును ప్రతిభావంతముగా తయారుచేయు సృజనాత్మక ప్రక్రియ అన్ననూ ఏ మాత్రము అతిశయోక్తి కాదు.**

యజ్ఞ చికిత్సా పద్ధతితో శారీరక వైద్యశాస్త్ర దృష్టిలో నివారింపలేని రోగములను కూడా నివారించవచ్చును. అదే విధంగా దాని ద్వారానే మానసిక వికారములను కూడా అదుపు చేయుట జరుగును. బ్రాహ్మణునకు ఆరు విధులు చెప్పబడినవి. అవి (1) యజ్ఞము చేయుట, (2) యజ్ఞము చేయించుట, (3) చదువుకొనుట, (4) చదువు చెప్పుట, (5) దానమిచ్చుట, (6) దానము పుచ్చుకొనుట. ఈ ఆరింటిని మూడు జతలుగా భావించవలెను. **యజ్ఞము, జ్ఞానార్జన, దానము ఈ మూటియందే బ్రాహ్మణుడు నిలిచియుండవలెను.** అనగా అతని జీవితములో ఒక భాగము యజ్ఞసాధనము నందే లగ్నమయి ఉండవలెను. యజ్ఞప్రక్రియ ఏ వ్యక్తి జీవితముతోనైనా ఎంత ఎక్కువగా మిళితమై యుండునో అంతగా ఆ వ్యక్తి మానసికముగా నిర్మలుడగును. బ్రాహ్మణుడు ఇందుకే అన్యవ్యక్తుల కన్నా అధిక పవిత్రత కలవాడుగా ఉండెడివాడు. యజ్ఞానుష్ఠానముల వలన అతని అంతఃకరణ అధికాధికంగా పవిత్రమవుతూ వచ్చేది. అతడు ఈ భూమిపైన రూపుదాల్చిన దేవత - భూసురుడు అని పిలువబడెడివాడు. యజ్ఞానుష్ఠానములను వదలివేయుట వలన నేడు బ్రాహ్మణ సమాజం, ఈ ప్రతిభను, విశేషతనూ పోగొట్టుకొని కూర్చుంది. ఈ యజ్ఞానుష్ఠానము కేవలం బ్రాహ్మణ జాతికే కాక ఎవరు తమ మానసిక స్థాయిని ఉత్కృష్టమొనరించుకోదలచెదరో, దేవత్వమాధారంగా వికసించదలచెదరో అట్టి వారందరికీ శ్రేయస్కరమే. **సంస్కారములకు తోడు ధర్మానుష్ఠానమును కూడ ఎవరు జోడింతురో అట్టివారు ఆ ప్రయోజనాన్ని పూర్తి చేసిన వారగుదురు.** నిత్యము ఈ విధమైన యజ్ఞానుష్ఠానయుతమైన జీవనమును కొనసాగించని వారు కూడ ఆయా ముఖ్యమైన సందర్భములలోనైనా యజ్ఞానుష్ఠాన సంస్కారములు నిర్వహించిననూ ఆశాజనకమైన పరిణామము పొందగలరు.

వ్యక్తి నిర్మాణ కార్యము సఫలం కావడానికి అధికమైన సహాయం లభిస్తుంది.

## కర్మకాండ - ప్రశిక్షణ

సంస్కారముల ప్రక్రియ రెండు భాగములుగా విభజింపబడుచున్నది. ఒకటి మంత్రోచ్చారణ యజ్ఞానుష్ఠానము మొదలగు కర్మకాండ రూపములో ప్రయుక్తమగు వైజ్ఞానిక స్వరూపము. రెండవది ప్రశిక్షణ, అవి మంత్రముల యొక్క వ్యాఖ్యానము విధివిధానములకు సంబంధించిన రహస్యములను వెలువరించు రూపములో వ్యక్తులు, వారి సంస్కారముల స్థాయిని బట్టి బోధించుట.

కర్మకాండ యొక్క వైజ్ఞానిక స్వరూపమును గురించి పైన కొంత చర్చ చేయబడినది. ఆ విషయంలో ఎంతగా చర్చించిననూ అది తక్కువే యగును. ఏవిధంగా అయితే కొన్ని ఔషధములు శరీరం మీద తాత్కాలిక ప్రభావాన్ని చూపిస్తాయో అదే విధంగా కర్మకాండకు కూడ సునిశ్చితమైన ప్రభావం ఉంటుంది. సరియైన పద్ధతిలో తగిన సమయంలో ఉచిత వాతావరణంలో ఈ సంస్కారములను నిర్వహించడం జరిగితే వాటి ప్రభావం అసాధరణంగానే ఉంటుంది. ఎవనికి అన్నప్రాశన సరియైన పద్ధతిలో జరిగిందో వానికి ఉదరమునకు సంబంధించిన వికారములు కలవాడై ఉండవలసిన అవసరముండదు. ఎవనికి విద్యారంభం విధివత్తుగా చేయబడిందో వాని అధ్యయనం ఆగదు. ఉపనయనం సరియైన పద్ధతిలో చేయబడితే అతడు జీవితాంతం మానవ ధర్మానుయాయిగానే ఉంటాడు. ఏ వధూవరుల వివాహం ఉచిత రీతిలో జరుపబడిందో అట్టి వధూవరుల జీవనంలో ప్రేమగంగ అవిచ్ఛిన్నరూపంలో ప్రవహిస్తూనే ఉంటుంది. వారిలో ద్వేషమూ, దుర్భావనలకు సంబంధించిన బీజారోపణ కూడా ఎప్పుడూ జరుగదు. ఇదే విధంగా ఇతర సంస్కారాల యొక్క విషయం కూడా ఉంటుంది. ప్రతి సంస్కారానికీ దానికి సంబంధించిన మహత్తు, ప్రభావమూ, పరిణామములుంటాయి. లేదా మొక్కుబడిగా, ఉపయోగం లేదన్నట్టి వాతావరణంలో నిర్వహిస్తున్నారు.



ఫలితంగా వాటి ప్రభావం కూడా చెప్పుకోదగినట్లు ఉండదు. ఇప్పుడు మనమొక వేళ భారతీయ సంస్కృతిని పునరుద్ధరించుటకు కటిబద్ధులమై ప్రాచీన భారతదేశం యొక్క గౌరవమును తిరిగి తేవలెను అను కలలను నిజము చేయుటకై బయలుదేరినచో తప్పక మన మహోన్నత సంస్కృతికి మూలాధారములైన సంస్కారప్రక్రియలను కూడ సజీవ మొనరింపవలెను. అప్పుడు వాటిని యుత్సాహము శ్రద్ధాతత్పరలతో నింపుటకై శ్రద్ధ వహించవలెను. వీటిపై ఎంత శ్రద్ధ వహించిన అంత సత్పరిణామములు మనముందు ప్రత్యక్షమగును. భారతదేశములో ధర్మానుయాయుల కుటుంబములలో ప్రతి యొక్కరికి ఈ సంస్కారములు జరిపించుటకుపాయమాలోచింపవలెను. అన్న, పాన, వస్త్ర, విద్య, వైద్యములు ఎంతటి ముఖ్యములైన అవసరములలో అంతటి అవసరములే ఇవి కూడా అని భావించవలెను. దీనికి తోడుగా విధి విధానములను సువ్యవస్థితమైన పద్ధతిలో నిర్వహించగల వ్యక్తులకు ప్రశిక్షణ నిచ్చుట అను ఆవశ్యకతను కూడా పూర్తిచేయవలయును.

## ప్రబోధనావశ్యకత

సంస్కారములలో ప్రయోగింపబడు కర్మకాండకు గల ప్రత్యేకత రహస్యముగా నుండును. వాటిలో గొప్ప మహత్మ్యము, మర్మము దాగియున్నవి. కర్మకాండను నిర్వహించు సమయములో ఈ రహస్యములను వ్యాఖ్యాన పూర్వకముగా తెలుపవలయును. అదికూడా చక్కని ప్రభావము పడునట్లుగా తెలుపవలెను. కేవలము కర్మనాచరించే వారికి మాత్రమే కాక ఆ ఆ కార్యక్రమములో పాల్గొను ఇతర వ్యక్తులపై కూడా ఆ ప్రభావము పడునట్లు ఉద్బోధించవలెను. ఈ సంస్కారములను చేయించే వ్యక్తి ఉత్తమ ప్రవక్తగా కూడా ఆయా కార్యకలాపములలోని రహస్యములను మంత్రములలోని మర్మములను చక్కగా తెలుపగలిగిన వ్యక్తిగా ఉండి వినువారందరూ వాటిని హృదయంగమమొనరించుకొనునట్లు తెలుపగలవాడై యుండవలెను. ధర్మప్రచారము, కర్తవ్య ప్రబోధము, వ్యక్తిత్వ నిర్మాణములతో కూడిన ఈ

ప్రశిక్షణయే మున్ముందు ప్రముఖమైన ఆధారంగా చేసుకొనవలసివచ్చును. కావున సంస్కారములను చేయించువారు ధర్మసంస్కృతుల యొక్క సందేశములను అందించగలవారుగ తయారై యుగనిర్మాతల భూమికను నిర్వహించుటకు సిద్ధము కావలసియుండును. ప్రాచీన కాలములో బ్రాహ్మణులు ఈ విధమైన కార్యముల తోడనే సాధారణ జనుల వరకు జేరి వారి వ్యక్తిగత పారివారిక సమస్యలను పరిష్కరించెడివారు. ఉపయోగించే వాతావరణంలో, ఉపయోగపడు పద్ధతిలో జరుగు ప్రశిక్షణ యొక్క ప్రభావం ఉపయోగపడేటట్లుగానే ఉండాలి. లోగడ ఉపయోగపడేది. మున్ముందు కూడా ఉపయోగించేది కూడా అయి ఉన్నది. ఈ రోజులలో ఈ విషయానికి సంబంధించి చాలా సిగ్గుపడవలసిన దుర్దశ కనబడుతోంది. దీనికి కాయకల్ప చికిత్స చేయడం తప్పదు. ఈ రోజులలో గ్రామగురువులూ, పురోహితులు, మొదలైనవారు నామమాత్రంగా శిక్షితులై అడ్డదిడ్డంగా ఇక్కడ, అక్కడ గంధాక్షతలు జల్లుతూ మంత్రాలను అశుద్ధంగా ఉచ్చరిస్తూ ఏదో విధంగా కర్మకాండను చేయిస్తున్నారు. సంస్కారముల యొక్క మహత్వంగానీ, రహస్యంగానీ స్వయముగా ఎరిగినవారు కారు. యజమానులకు ఎరుకపరచగల్గినవారు కూడా కాదు. గంధాన్నీ, అక్షతలనూ ఇటునుంచి అటూ అటునుంచి ఇటూ పెట్టడంతోనే వారి పని పూర్తి అవుతుంది. ఈ చిహ్నములూ, పూజలూ ఏ ప్రయోజనమునకై ఈ విధమైన మహత్తర పరంపరలను నిర్మాణమొనర్చుట జరిగినదో అట్టి ప్రయోజనములు సిద్ధింపజేయలేవు.

కర్మకాండ యొక్క వైజ్ఞానిక ప్రక్రియతో యజమాని కుటుంబమును ప్రభావితము చేయుటతోబాటు ఆయా శుభ సందర్భములలో వారు నిర్వహించవలసిన కర్తవ్యములను ప్రబోధించుట కూడా ఎంతో అవసరము. సంస్కారోత్సవముల సందర్భంలో కుటుంబమునకు చెందిన సభ్యులు ఇరుగుపొరుగువారు, పరిచయస్తులు, స్త్రీ పురుషులు ఒకచోట జేరెదరు. **సుఖ దుఃఖములు కలసి పంచుకొని అనుభవించు పద్ధతి భారతీయ సంస్కృతిలో ముఖ్యమైన భాగము.** శ్రేయస్సును సాధించిపెట్టగల సంస్కారోత్సవము



జరుపుకొనుచూ తనవారినీ, బంధువులనూ పిలిచి ఒకచోట చేర్చకుండుట ఎట్లు సాధ్యమగును? ఇంటివారు మాత్రమే ఈ ఆనందోత్సవములో పాల్గొనుటకు సిద్ధము కారు. వారు తమ స్నేహితులను ఇరుగుపొరుగు కుటుంబముల వారిని సంతోషముతో ప్రార్థించి ఆహ్వానింతురు. సాధారణంగా అట్టి సమయములలో అనేక మంది ఒకచోట చేరెదరు. అయితే, **కాలువలో బెల్లము కలిపినట్లు ఇప్పటి వరకూ ఈ కలయిక వృథా యగుచున్నది.** అట్లుకాక కుటుంబ సభ్యులను ప్రక్కవారిని పరిచయస్తులను, స్త్రీ పురుషులను, బాలురూ, వృద్ధులూ మొదలైన వారందరినీ పిలువవలెను. కేవలం సంస్కారమును పొందెడివారు మాత్రమేగాక అటువంటి వాతావరణం యొక్క శక్తి ప్రవాహంతో ధర్మ ప్రశిక్షణతో చేరిన యావన్మందీ లాభమును పొందగలుగవలెను.

## విచారగోష్ఠుల ఏర్పాటు

ప్రాచీన కాలములో ఇట్టి ఏర్పాట్లు జరుగుచుండెడివి. సంస్కారములను నిర్వహించు సమయములో కుటుంబ సభ్యులకూ, ఇరుగుపొరుగు ఇండ్ల వారికి సంస్కారము చేయించు విద్వాంసులయిన పురోహితులు-ఆచార్యులు వారి కర్తవ్యములను గురించి ప్రేరణనీయగల పద్ధతిలో ప్రబోధించెడివారు. జీవించు కళ, ధర్మము ఆధ్యాత్మకు, ధార్మిక కర్తవ్యములు మొదలగువాటి విషయమున మార్గదర్శనమొనరించెడివారు. సంస్కారములను నిర్వహించు సందర్భములో ఏర్పాటు చేయుబడెడి ఈ విధమైన జనగోష్ఠులలో మంత్రములను వ్యాఖ్యానించుచు ఆచార్యులిచ్చు ప్రేరణ వినువారి భావములను ఉప్పొంగించెడివారు. తమ కర్తవ్యముల పట్ల జాగరూకులూ, సావధానులు నగుచుండెడివారు. ఈ విధముగా రెండుమూడు గంటల ధార్మిక గోష్ఠి ఒక ముఖ్యమయిన విద్యను అభ్యసించు అవకాశమును కల్పించెడిది. ప్రతి కుటుంబములో అనేక రకముల మనుష్యులుండెదరు. ప్రతి వ్యక్తికినీ షోడశ సంస్కారములు ఉన్నవి. కావున రాబోవు దినములలో వారివారి ఇండ్లలో కూడా ధర్మగోష్ఠులు ఏర్పాటు చేయబడును. ఇరుగుపొరుగుననున్న వారి ఇండ్లలో

కూడ ఇవి జరుగును. వీటి పరిణామము రాబోవు రోజులలో ధార్మిక గోష్ఠులు ఏర్పాటగును. ఈ సౌకర్యము ఎక్కడ లభించునో అక్కడనుండెడి మనుష్యులు చెడుమార్గము ననుసరించువారు, త్రోవ తప్పువారు ఎట్లగుదురు?

సాధారణ వాతావరణంలో అందింపబడిన శిక్షణ, ధర్మోత్సాహము, ఉల్లాసము, సంతోషములతో నిండిన వాతావరణములో జరుపబడిన శిక్షణ అంతగా, హృదయంగమమూ, ప్రభావశాలీ కాజాలదు. దంపతుల యొక్క కర్తవ్యములను గురించి ఏదైన పుస్తకములో చదివిననూ, తెలుసుకున్ననూ వివాహ సమయంలో వధూవరులిద్దరూ పరస్పరం చేతులు పట్టుకొని గౌరవనీయులైన గురువుల ఎదుట, దేవతల సమక్షమున, అనేక మంది జనుల ముందు చేసిన ప్రతిజ్ఞలంత ప్రభావము కలిగియుండదు. ఆ ప్రతిజ్ఞలు నిండు మనసుతో చేసినట్లయితే జీవితాంతము వరకు గుర్తుండును. ఒకవేళ పొరపాటున తప్పు చేసిననూ ఒకరికొకరు ఆ ప్రతిజ్ఞ జ్ఞప్తికి తెచ్చి బిడియపడునట్లుగాను, జాగ్రత్త పడునట్లు గాను చేయవచ్చును. **గంగానదిలో నిలచి గంగాజలాన్ని చేతిలోకి తీసుకొని ప్రతిజ్ఞ చేసెడి మనిషి అసత్యము పలుకుటకు భయపడును.** కానీ మామూలుగా అయితే మాటిమాటికీ అబద్ధములాడుచునే యుండును. ధర్మానుష్ఠానములో గల మహత్తర మనోవైజ్ఞానిక లాభము, లేదా రహస్యము ఇదే. ఆ సమయంలో చెప్పినవి లేదా విన్నవి ఎంతో ప్రభావం కలిగినవి అవుతాయి. సామాజిక శాస్త్రము, మనోవిజ్ఞాన శాస్త్రములు రెండూ ఈ వాస్తవాన్ని బలపరుస్తున్నాయి. **చక్కని వాతావరణంలో యోగ్యమైన పరిస్థితులలో గరుపబడిన శిక్షణ యథాలాపంగా చెప్పిన లేక విన్నదానికంటే ఎంతో ప్రభావశాలిగా ఉంటుంది.** సంస్కారములను నిర్వహించు సందర్భంలో ఏర్పాటు చేయబడిన గోష్ఠులు ఈ ప్రయోజనమును సిద్ధింపజేస్తున్నాయి. వాటి ఆధారంగా అందింపబడిన శిక్షణ యొక్క ప్రభావం వినువారి మనసులోనికి జొరబడగలదై ఉండవలెను.



## సార్వజనికమైన శిక్షణ - నిరుపమానమైన సాధనము

లోకములోని వారినందరిని విద్యావంతులను చేయుట యనునది యుత్తమ కార్యమే. **ప్రతి వ్యక్తిని విడివిడిగా సుశిక్షితుల నొనరించుట ధర్మప్రచారకుల కత్యంత కఠినమగును.** అందరిని ఒకేచోటకు జేర్చిన జనజాగరణకవసరమైన చర్చ చేయుటకు వీలగును. సంస్కారముల యొక్క ఉత్తమ పరంపరను అమలుచేయుటకు ఇంతకు మించిన చక్కని మార్గము మరియొకటి లేదు. ఈ సంస్కారముల సహాయముతో వ్యక్తిని, ఉత్తమ కుటుంబ వ్యవస్థను రూపొందించుటలోనూ, కలిగెడి చిక్కు ముడులను తేలికగా విప్పవచ్చును. తద్వారా అన్ని స్థాయిలలోని వ్యక్తులకు వ్యక్తుల యొక్క మనస్సులలో వాటి విశేషాలు లోతుగా నాటుకునేటట్లు చేయవచ్చును. ఇందుకొరకు ఒక వేదిక అవసరము. వ్యక్తులను ఒకచోటకు చేర్చవలసినదే. అయితే పెద్దపెద్ద సభలు, సమ్మేళనముల కంటే ఇంటింటిలో జరుగు ఈ శిక్షణ ఎంతో ఉపయుక్తము కాగలదు. ఇందుకు సంబంధించిన ప్రయోగము, అన్వేషణ, లక్షల సంవత్సరముల నుండి ఈ దేశములో జరుగుచునే యున్నవి. విద్యాంసులైన బ్రాహ్మణులు-ఈ ప్రక్రియల ద్వారా దేశప్రజలను ప్రబోధించిరి. ప్రబుద్ధుల నొనరించిరి. తత్ఫలితంగా ఇక్కడ శక్తి, సామర్థ్యము, విద్య, బలము, వైభవము, శౌర్యము, పరాక్రమము మొదలైన వాటిలో ఏ విధమైన లోటు ఉండెడిది కాదు. ఇప్పుడు మనం మరల అదే పరిపాటిని పాటిస్తూ నవనిర్మాణము, సాంస్కృతిక పునరుజ్జీవన కార్యములను పూర్తి చేయవలసి ఉండును.

నేడు ఈ సంస్కారముల ఆచరణకు సంబంధించిన అలవాటు ఒక రకంగా సమాప్తమైనది. మరల మనము వాటిని క్రమశః వికసింపచేయాలి. పదహారు సంస్కారములకు బదులు పది సంస్కారములను ఆచరిస్తే చాలు. ఎందుకనగా ఈ రోజుల్లో సమయము, ధనము, ఉత్సాహము, పరస్పర సహకారం, ధర్మనిష్ఠ మొదలైన అన్ని విషయాల్లో లోటు ఏర్పడినది. దేశకాల పాత్రతలను బట్టి వ్యవస్థను ఏర్పాటు చేయుట, వాటిలో అవసరమయిన

మార్పులు చేయుట అనునట్టి ఋషి పరంపరను బట్టి ఈనాడు పది సంస్కారములకు పరిమితమగుట ఉచితమే కాగలదు.

## ప్రస్తుత కాలమునకు పనికిరాని కొన్ని సంస్కారములు

వీటిలో మొదటి సంస్కారము గర్భాదానము. పూర్వకాలంలో రతిక్రియ తుచ్ఛవాసనను పూర్తి చేసుకొనుటకుగా ఉండెడిదికాదు. సంతానోత్పత్తి కొరకే జరిగెడిది. ఇతర పశుపక్షులలో వలె ఒక్కసారి కలిసినంత మాత్రముతోనే సఫలమయ్యెడిది. కానీ నేడు ప్రతిదీ తలక్రిందులైనది. ఏకాంతంగా కలవడం కేవలం వాసనాతృప్తికే పరిమితమై కూర్చుంది. ఈ స్థితిలో గర్భాదాన సంస్కారానికి స్థానమెక్కడుంది? అంతేగాక ఈ సంస్కారము యొక్క పరిణామం గర్భస్థాపన అనునది కూడా అనిశ్చితంగానే ఉంటున్నది. ఈ స్థితిలో నేడు ఆ సంస్కారాన్ని నేటి కాలానికి పనికి రానిది అని చెప్పవచ్చును. అయితే దీనికి పతిపత్నుల ప్రతి కలయికకూ ముందు "మేము సంతానోత్పత్తి కొరకు, పుట్టిన శిశువు యోగ్యుడుగా తయారై తద్వారా సమాజానికి చక్కని శరీరము, మనస్సు కలిగిన ఉత్తమ నాగరికుని సమర్పించడానికి కలియుచున్నాము. సంతానోత్పత్తి గొప్పకార్యము. కావున మా కలయిక కేవలం హేయమైన ప్రయోజనం కొరకు కాక, విశ్వ మానవునకు మేమొక ఉపహారమును సమర్పించుటకే కలియుచున్నామని, ఈశ్వరుడు మా ఆకాంక్షను పూర్తి చేయవలెను'' అని సంకల్పించవలెను. ఈ సంకల్పము సంతాన భారాన్ని మోయగలిగిన శారీరక, మానసిక, ఆర్థిక మరియు కౌటుంబిక దృష్టితో సంపూర్ణ సమర్థత కలవారికి మాత్రమే ఉచితమైనది. పతిపత్నుల యొక్క సంయోగ సమయంలో కూడా వారిరువురి మనస్సులలో ఇదే భావన ఉండవలెను. పుట్టబోవు బాలకుని గర్భప్రవేశ సమయంలో తల్లిదండ్రుల మనసులలో ఈ విధమైన సంకల్పముంటే పుట్టిన పిల్లవాడు ఉత్తమ సంస్కారి కావడం నిశ్చయం. ఈ రోజుల్లో నేటి పరిస్థితులలో గర్భాదాన సంస్కారము ఇంత సంక్షిప్తంగా ఉంటే



చాలు. దానికి సంబంధించిన కర్మకాండ విధ్యుక్తముగా జరుపగల అవకాశం నేడు లేదు. గర్భవతికి గర్భరక్షణకు సంబంధించిన జ్ఞానాన్ని, ప్రేరణను కలిగించుటకై పుంసవనము, సీమంతము, అను రెండు సంస్కారములు చేయు పరిపాటి ఉండెడిది. ఈనాడు ఈరెంటిలో ఒక్క సంస్కారము నిర్వహించినా, తక్కువేమీ కాదు. ఇదే విధంగా శిశువు జన్మించిన తరువాత బొడ్డుకోసేముందు నిర్వహించవలసిన జాతకర్మ సంస్కారము కూడా నేడు అవసరములేనిది అనిపిస్తున్నది. బాలకుడు భూమి మీద పడగానే తల్లి "ఈ పిల్లవాడు ధర్మం యొక్క ప్రయోజనాలను పూర్తిచేయుటకు జన్మించినాడు అందుకే జీవించును'' అన్న భావన కలిగి ఉంటే ఉపయోగిస్తుంది.

ముక్కు, చెవులు కుట్టించుటకు జరిపే సంస్కారం ఈ కాలమునకు అవసరం లేనిదే అనిపిస్తుంది. మగపిల్లల చెవులు కుట్టించుట ఏనాడో ఆగిపోయినది. నేడు ఆడపిల్లలు కూడా దీనికి ఇష్టపడుట లేదు. ఈ విధమైన పని అందచందాల దృష్టితో ఆరోగ్య దృష్ట్యా కూడా అనవసరమని, హానికరమని భావింపబడుతోంది. రాబోవు 20, 30 సంవత్సరాలలో భారతీయ బాలబాలికలు ముక్కు, చెవులు కుట్టించుకునే పద్ధతిని వదలివేస్తారని నిశ్చయంగా చెప్పవచ్చును. మనకు కూడా ఈ విధమైన ఆలోచనలో అనుచితమేమీ కనబడనందున ''కర్ణవేధ'' అను సంస్కారమును షోడశ సంస్కారముల నుండి తొలగించవచ్చును. ఇదే విధంగా నేడు విద్యార్థులు గురుకులములలో గురువులతో కలిసి ఉండు పద్ధతిని వదిలి ఇండ్లలోనే ఉండి పాఠశాలలలో, కళాశాలలో విద్యనభ్యసించుచున్నారు. ఈ స్థితిలో గురుకులములో ప్రవేశించు సమయములోను, గురుకులమును వదలివచ్చు సమయములోను, వేదారంభము, యజ్ఞోపవీతము, సమావర్తనము, అను ప్రాచీనకాలములో నిర్వహింపబడు మూడు సంస్కారములుండెడివి. నేడు మూడింటినీ కలిపి ఒకేమారు చేయుచున్నారు. అనగా విద్యార్థి గురుకులములో ప్రవేశించిన రోజుననే రెండు గంటల తర్వాత చదువు ముగించుకొని ఇంటికి పోవు అవకాశమును

పొందుట హాస్యాస్పదముగా నున్నది. నేడు ఈ మూడింటి స్థానములో కేవలము ఉపనయనము చేయించిన చాలును. ఈ విధంగా గర్భాదానము, సీమంతము, జాతకర్మ, కర్ణవేధ, వేదారంభము, సమావర్తనము అను ఈ ఆరు సంస్కారములూ తగ్గించి మిగిలిన పది సంస్కారములను ఆచరించునట్టి విధానమును స్వీకరించవలెను.

## పుంసవన సంస్కారము కలిగించు ప్రేరణ

పుంసవన సంస్కార నిర్వహణ ద్వారా గర్భవతియైన స్త్రీ తన కర్తవ్య నిర్వహణకు, అట్లే కుటుంబములోనికి ప్రవేశించబోవు నూతన జీవిని స్వాగతించుటకు అనుకూలమగు వాతావరణ నిర్మాణమునకు కావలసిన శిక్షణను గరపుట జరుగును. ధర్మానుష్ఠానము గర్భస్థ బాలకునిపై ప్రేరణాత్మకమైన ప్రభావమును చూపును. అట్లే కుటుంబములోని సభ్యులందరు నూతన ప్రాణి యొక్క దివ్యావతరణ జరుగు పుణ్యప్రద సమయంలో తమ తమ కర్తవ్యముల నిర్వహణకు ఏమేమి చేయవలెనో తెలుసుకొనెదరు. **బాలకునకు వ్యక్తిత్వ నిర్మాణము, యోగ్యమగు శిక్షణ, గర్భస్థ దశ నుండియే ప్రారంభము కాగలదు.** అది ఏ విధంగా చేయవలెనో అన్న విషయమును విస్తారముగా తెలుసుకొనుటకు ఏర్పడినదే పుంసవన సంస్కారము. వ్యక్తి నిర్మాణ కార్యము దీనితోనే ప్రారంభమగును.

## నామకరణ సంస్కారము యొక్క ప్రయోజనము

నామకరణ మహోత్సవ సమయంలో పిల్లవాని శారీరక పోషణయే గాక మానసిక వికాసమునకు సంబంధించిన విధులను తెలుసుకొను అవకాశము కలుగును. తల్లిదండ్రులే గాక కుటుంబములోని సభ్యులందరు ఈ నూతన ఆగంతకుని ఉత్తమ సంస్కారిగా తీర్చిదిద్దుటలో తమకు గల బాధ్యతలను గుర్తించి వాటిని పూర్తిచేయగలిగెదరు.



## అన్నప్రాసన సంస్కారమెందుకు?

దీనివలన కుటుంబములోని పెద్దలకు పిల్లవాని ఆరోగ్య పరిరక్షణకు ఏ విధముగా ఎంత తినిపించవలయునో, అతని మానసిక ఆరోగ్యము కొరకు ఆ అన్నము ఎంత సాత్వికము, పవిత్రము అయి ఉండవలెనో నేర్పబడును. **అన్నముతో శరీరమే కాక మనస్సు కూడా రూపొందును. కావున పిల్లలను శారీరకముగా, మానసికంగా సమర్థులుగా తయారుచేయుటకు, వారికిచ్చెడి ఆహారముపై శ్రద్ధ చూపవలయును.** ఇందుకు సంబంధించిన వివరములను తెలుపు విద్య అన్నప్రాసన సంస్కారమును నిర్వహించు సమయములో బోధింపబడును. ఆ సందర్భములో అక్కడకు చేరిన వారందరికి తమ తమ ఆహారములను ఏ విధముగా ఉంచుకొనవలెనో శారీరక, మానసిక ఆరోగ్యములు పొందుటతో బాటు దేశములో ఏర్పడిన ఆహారపదార్థముల కరువు కాలంలో తాము చూపవలసిన సమర్పణ భావనకు సంబంధించిన విషయములు కూడా ప్రబోధింపబడును.

## పుట్టు వెంట్రుకలు తీయించుటలో గల రహస్యము

పుట్టు వెంట్రుకలు తీయించుట, గుండు గీయించుట అను పనుల యొక్క అర్థము మెదడును కాపాడుటలో శ్రద్ధ వహించుట అని. పిల్లవాడు చిన్నతనములోనే ఎంతో నేర్చుకొనుచు. అతని కర్మ, స్వభావముల యొక్క తయారీ మూడు వంతులు చిన్నవయసులోనే జరుగును. చూడాకర్మ సమయంలో కేవలము వెంట్రుకలు తీయిస్తే సరిపోదు. బాలకుని భావి జీవితంలో మహాపురుషుడుగాను, నరరత్నముగాను రూపొందుటకు కావలసిన భూమికను తయారుజేయగల యోగ్యతను నిర్మించగల సంస్కారమిది.

## విద్యార్జనకు శ్రీకారము

విద్యారంభమునకు, అక్షరాస్యతకు శ్రీకారము చుట్టుటయన్నది మనిషి జీవితములో అతిముఖ్యమైన ఘట్టము. పిల్లలను చదివించుటతో బాటు

కుటుంబములోని సభ్యులందరును విద్య, దాని స్వరూపము యుద్దేశ్యములను నిర్ధారించవలయును. పాఠశాలలో పొందుజ్ఞానమునకు తులతూగగల జ్ఞానము. ఇంటిలో కూడ లభించవలెనను విషయమును వారు గ్రహించవలయును. **భాష, గణితము, భూగోళము మొదలగు విషయములు పాఠశాలలో బోధింపబడును గాని, గుణ, కర్మ, స్వభావములకు సంబంధించిన శిక్షణ కుటుంబ వాతావరణములోనే లభించును.** ఈ ద్వివిధ శిక్షణలు ఏవిధముగా అందించవలెనన్న విషయము కటుంబ సభ్యులకు తెలియజేయుటకే విద్యారంభ సంస్కారము.

## యజ్ఞోపవీత ప్రభావము

మానవత్వమునకు సంబంధించిన ఆదర్శములను హృదయంగమ మొనరించుకొని, తన జీవననీతిని యజ్ఞ సంబంధమైన ఆదర్శములతో లోకహితార్థము పనికిరాగల నియమాలను స్వీకరించి బ్రతుకవలెనన్న ప్రేరణను కలిగించి పాశవికమైన ఆకాంక్షలు, కోరికలు, భావనలకు వశముగాక మానవత్వము యొక్క మహోన్నతాదర్శములను సాధించుటకై జీవింతునని ప్రతిజ్ఞజేయును. ఈ ప్రతిజ్ఞను అతడొకదారముతో చేయబడిన దీక్షాసూత్రంగా యావజ్జీవితము గుండెలపై వ్రేలాడునట్లు ధరించును. తద్వార తన జీవన రీతిని సదా స్మరించును. దారం రూపంలో తన ఆదర్శములను నిరంతరము గుర్తుంచుకొనును. ఈ సంస్కార సందర్భంలో విచ్చేసిన యితరులు కూడా తమ జీవననీతి ఏమో, జన్మనేవిధంగా సార్థకం చేసుకొనవలెనో అన్న విషయాన్ని జ్ఞాపకం చేసుకునే స్ఫూర్తిని పొందుతారు.

## వివాహము - ధర్మము - కర్తవ్యము

వివాహమనగా రెండు ఆత్మల కలయిక లేక కొత్త కుటుంబము, కొత్త సమాజము యొక్క సృష్టి. ఇంత మహత్వము గల యీ కార్యమును ఏ ఆదర్శములు, సిద్ధాన్తములు, నీతి, భావనలు, కార్యకలాపములతో నింపవచ్చునో దానికి సంబంధించిన వివేచన, వ్యాఖ్యానములు వివాహ మంత్రములలో



నింపబడినవి. పతి, పత్నులు యీ వివాహ ఒప్పందమును ఎంత నిష్ఠతో తత్పరతతో పాలించవలసి వచ్చునో దానికి సంబంధించిన స్పష్టమైన రూపురేఖలు వైవాహిక ప్రక్రియలోని క్రియా కలాపములలో ఉన్నవి. వాటికి సంబంధించిన వివరణ సరియైన పద్ధతిలో చేయుట, వధూవరులిద్దరూ ఆ మాటలను జాగ్రత్తగా వినుట, పూర్తిగా అర్థము చేసుకొనుట అనునది ఆవశ్యకము. దేవతలు, భద్రపురుషులు, అగ్నిలసాక్షిగా చేసే ప్రతిజ్ఞలను సరియైన పద్ధతిలో అర్థం చేసుకోవడం, అవగతం చేయబడడము జరిగితే ప్రతి వివాహం ఒక నూతన అమృత నిర్ఝరిని ప్రవహింప చేయగలదు. ఇదే విధంగా ఆ మంగళమయ ధర్మానుష్ఠానాన్ని విధ్యుక్త కర్మకాండతో పూర్తి చేయించగలిగితే ఆ యిరుపక్షాలకూ శుభం జరుగుతుంది. మంగళమయమైన పరిణామము ఉత్పన్నం చేస్తుంది. విధివత్తుగా జరిగే వివాహాలలోనూ ఏదో విధమైన అసఫలత కానీ, అమంగళం కానీ, అశుభ పరిణామం కానీ కదాచిత్తుగా కలుగవచ్చును. ఈనాడు ప్రజలు వివాహోత్సవము యొక్క హడావుడిలో నిమగ్నమయి ఉంటారు. కానీ సంస్కారమునకు సంబంధజంచిన వ్యవస్థ, మహత్వములను ఉపేక్షించి పారవేయుదురు. వధూవరులే కాక వివాహములో పాల్గొనేవారందరూ దృష్టిపెట్టి ఈ ధర్మానుష్ఠానములను చూచి తమ తమ దాంపత్య జీవితములలో కలుగు లోపములను సరిచేసుకొనుటకు ప్రశిక్షితులై మంచి గృహస్తులగు పద్ధతిని తెలుసుకొనగలరు.

## వానప్రస్థము లోకకల్యాణమునకొక సాధనము

తరువాతి సంస్కారము వానప్రస్థము. పిల్లలు సంపాదనపరులైన వెంటనే కుటుంబ బాధ్యత వారిపై పెట్టి తాము కేవలము వారికి మార్గదర్శనము మాత్రము చేస్తూ మిగిలిన సమయాన్ని ఆత్మకల్యాణము కొరకు, విశ్వమానవసేవ కొరకు ఉపయోగించుటకు పూనుకొనవలెను. ఇందులోనే జీవితమునకు సఫలత ఉన్నది. ఒడిలిపోయి ఆఖరు ఊపిరి పీల్చేవరకూ ఉదరపోషణకు తాపత్రయపడుతూ ఆశ, వాసనలకు లోబడి ఉండే వ్యక్తి మానవ జీవనం యొక్క విలువ అర్థం చేసుకొనని వాడే అగును. వానప్రస్థ సంస్కారము వివాహ సంస్కారము కన్నా

మిక్కిలి అవసరమైన సంస్కారము. వ్యక్తిగతము, సమస్త సమాజ గతమూ నైన శ్రేయస్సు ఈ రాజమార్గంలో నడిస్తేనే సంభవమగును. ఉన్నతమైన ఆదర్శాలకు అనురూపంగా జీవనము తీర్చిదిద్దుకొనుట, అదే విధమైన పరిస్థితులను సమగ్ర సమాజములో ఉత్పన్న మొనరించుటకు స్వీయప్రతిభను వాడుటకు, కావలసిన ప్రేరణ ఈ సంస్కారము వలన లభిస్తుంది. ప్రాచీన కాలంలో సమాజమునకు సంబంధించిన ప్రతిక్షేత్రంలో వానప్రస్థులే నిస్వార్థంగా నేతృత్వం చేసేవారు. నేడు ఈ పుణ్య పరంపర నశించిపోవుట వలన ఉత్తమ నేతృత్వానికి ఉపయోగపడే వ్యక్తి లభించని సంకట స్థితి ఉత్పన్నమైనది. ప్రపంచంలో ఎన్ని సమస్యలున్నవో వాటిని పరిష్కరించటానికి నిద్రాణంగా ఉన్న జనమానసమును జాగృత మొనరించగల ప్రబుద్ధులైన లోకసేవకులకు సంబంధించిన ఒక విశాలసేన నేడు అవసరము. ఆ అవసరాన్ని నిష్కామ్యమైన భావనలతో ఓతప్రోతులై ధర్మమును ప్రేమించగల వానప్రస్థులే తీర్చగలరు. ఈ సంస్కారాన్ని యోగ్యుడైన ప్రతి వ్యక్తి చేసుకోవాలి. ఈ గాలి వీస్తే ఈ సమాజానికి కాయకల్ప చికిత్స ఆలస్యముండదు.

## మరణానంతర సంస్కారము

అన్త్యేష్టి లేక మరణానంతర సంస్కారమునకు విధి విధానమున్నది. ఇది దివంగత జీవునికి సద్గతిని కలిగించును. అతని కుటుంబ సభ్యులకు చావుబ్రతుకులలోని రహస్యములతో పరిచితులను చేసి వారు తమ జీవనమును సదుపయోగమొనరించుకొనుటకు తగిన శిక్షణనిచ్చును. దానికి తోడు దివంగతుడు వదలిపెట్టి వెళ్లిన కర్తవ్యములను పూర్తి చేయుటకెవరేమి చేయాలో దానికి తగిన ప్రేరణనిస్తుంది. మరణించినవాని సద్గుణములను, సత్కర్మలను ప్రశంసించుట ఆతని ద్వారా చేయబడిన ఉపకారములకు శ్రద్ధాంజలి ఘటించుట. అనుకరించదగిన విషయాల నుంచి ప్రేరణను పొందుట, మొదలగు పనులన్నీ చనిపోయిన వారికి చేసే సంస్కారముల ద్వారా ఒక నూతనమైన చైతన్యమును కల్పించును. తద్వారా మన జీవితమును అతిజాగ్రత్తతో సదుపయోగమొనరించుటకు తత్పరులము కావచ్చును.



## లోకశిక్షణకు విస్తారమైన పూర్వరంగము

ప్రతి సంస్కారము యొక్క ఆలోచనాపరిధి ఎంతో విశాలము, వ్యాపకము. దాని ద్వారా యీ కాలమునకు సంబంధించిన సమస్యలను గుర్తించి, విశ్లేషించి పరిష్కారములు చూపవచ్చును. వ్యక్తిగత జీవనమును ఉత్తమ సంస్కారయుతమొనరించుట, కుటుంబ జీవనములోని అస్తవ్యస్తస్థితి మీద సామాజిక జీవనమందలి అవ్యవస్థ మీద యీ సంస్కారముల నిర్వహణ ద్వారా గట్టిదెబ్బ కొట్టవచ్చును. ఆరోగ్యకరమైన పథ ప్రదర్శన మొనరించుచు యీ ధర్మసమ్మేళనములలో పాల్గొనువారికి మార్గదర్శనమొనరింపవచ్చును. ప్రతి వ్యక్తికి పది సంస్కారముల చొప్పున జరుగునప్పుడు ఒక కుటుంబములో సగటున ఐదారుగురు సభ్యులున్నచో, ఆ యింటిలో సంస్కారములు నిర్వహించు అవకాశము ఏబది మారులు వచ్చును. మనము నివసించే బస్తీలోను, చుట్టుప్రక్కల, గ్రామమందు ఒక వంద ఇండ్లలో మన సంపర్కంతో సంస్కారములు నిర్వహింపబడినచో ఐదువేల మార్లు యీ విధమైన ప్రేరణనందీయగల ప్రశిక్షణ ప్రతివ్యక్తికిని అందుతుంది. సంస్కారమును చేయించే వ్యక్తియోగ్యుడయితే అతడదే ప్రయత్నంలో ఆ ప్రదేశమందలి యావన్మందిలో ధార్మిక భావనలను నింపగలుగుతాడు. జనజాగరణకు, సమాజ నిర్మాణోద్దేశ్య పూర్తికి ఇంతకంటే యుత్తమమైన పద్ధతి మరియొకటి యుండదు. ఋషులు మానవ తత్వమును లోతుగా పరిశీలించి, అధ్యయన మొనరించిన మీదటనే యీ పరిపాటిని నెలకొల్పినారు. సంస్కారములన్న పుణ్యప్రణాళిక ఆధారముగానే వారీ దేశమందలి ప్రతి పిల్లవానిని సుసంస్కారినొనరించుటలో సాఫల్యతను సాధించినారు. మనము మన పునరుత్థానమును నిజంగా సాధించుకోదలిస్తే యీ పరిపాటిని పునరుజ్జీవింపజేయవలసినదే.

## యాంత్రికంగా నిర్వహించరాదు

గతానుగతికంగా, యాంత్రికంగా యీనాడు కూడా అక్కడక్కడ సంస్కారములు నిర్వహింపబడుతూ ఉన్నవి. కానీ వాటిలో పూజాపారాయణలు

గతానుగతికంగా సాగుచుండనే గాని పదిమందికి వాటి ఆంతర్యములను ప్రబోధించు ప్రక్రియ కనబడదు. పైగా నిది పండితునబడువారు, పురోహితులు, కావలసినంత సంపాదన కొరకే ఉండుట వలన ఖర్చుతో నుండుట వలన సామాన్యులు భరించలేక వారెవరు చేయించుకొను సాహసం చేయరు. ఉపనయన సంస్కార మొనరించుకొను ఆచారము గలవారికి యిట్టి చిన్న ధర్మానుష్ఠానమునకు ఎన్నేసి వేల రూపాయలో ఖర్చు చేస్తేనే గాని నిర్వహించడము కుదరదని తెలుసును. వివాహాలలో జరిగే ఖర్చు చేస్తేనే గాని నిర్వహించడము కుదరదని తెలుసును. వివాహాలలో జరిగే ఖర్చు నేడొక సామాజికోన్మాద స్థితికి జేరుకొన్నది. ఖర్చులు పెరిగిన యీ రోజులలో ఇంత ఖర్చుతో కూడిన, ఉపయోగములేని కర్మకాండ నడవకూడదు. ఒక వైపున ధర్మనిష్ఠ తగ్గిపోతుంది. ఈ స్థితిలో నిటువంటి ధర్మకార్యములకు భరించరాని ఖర్చు పెరిగితే వాటి విషయంలో ప్రజలు విముఖత చూపుతారు, నేడు చూపిస్తూనే యున్నారు. ఈ స్థితిని మనము మార్చవలెను, ఖర్చు తక్కువ, ఉపయోగమెక్కువ కావాలి.

ఈ సందర్భములో అన్నిటికన్న ముఖ్యమైన ఆవశ్యకత ఈ విధముగా ప్రశిక్షితులైన సంస్కార కర్తలది. వారు కేవలము విధి విధానములో ధర్మానుష్ఠానమునకు సంబంధించిన కర్మకాండను చేయించుటయేగాక ప్రభావంతమైన పద్ధతిలో ప్రవచన విశ్లేషణ, ప్రశిక్షణలనీయగలవారయి యుండవలెను. ఈలోటు తీర్చుటకు శిక్షణ పొందుటకు వ్యక్తులు ముందుకు రావలయును. వారందరు ఈ విద్యను నేర్చుకొనవలయును. ఇందుకవసరమైన (శాంతికుంజ్ హరిద్వార్) ఏర్పాటు చేయబడినది. ప్రతిచోట యీ విధమైన శిబిరము నిర్వహించుటకేర్పాటు చేయబడినది. వాటిలో స్థానికులకు సంస్కారములు చేయించు విధానము, కార్యక్రమములు, ప్రవచనములు నేర్పబడును. ఎవరికేసంబంధమైన రుచియుండునో వారికావిధమైన ఏర్పాట్లు చేయబడును. విధానము, ప్రవచనము నేర్పబడును. ఎవరి ఆసక్తి ఈ విషయములలో కలదో వారికి ఆ విధమైన ఏర్పాటుండగలదు. ప్రస్తుత పండితులు, పురోహితులు కూడ ఇదియంతయు నేర్చుకొనవలెను. **లేనిచో**



**కాలము ముందుకు సాగి వారు వెనుకబడుదురు.** అప్పుడు వారు తమ గౌరవము, కార్యములలో వెనుకబడవలసియుండును. నిరుపయోగ కార్యములతో వ్యక్తి కేవలం పరంపర ఆధారముగా ఉపయుక్త రీతిలో తయారు కాలేరు. కావున సమయమున్నప్పుడు వారు తమను తాము యోగ్యులుగా దిద్దుకొనవలెను. ఎందుకనగా సమయానుసారము వారి ఉపయోగము నిలిచి యుండగలదు. సంస్కారముల విధి, వ్యవస్థల, శిక్షణ ఎక్కువ మంది పొందినప్పుడే అది విస్తృతరూపములో అమలు కాగలదు.

**సుశిక్షిత కార్యకర్తల అవసరము** : సంస్కారములను చేయించు కార్యక్రమము గాయత్రి పరివార్ శాఖలు సామూహికంగా చేయించగలవు. వాటి కార్యకర్తలు అవసరమైన పూజాసామాగ్రి, మండపము, వేదిక, కలశము, ప్రదేశము మొదలైన అన్ని ఉపకరణములను తయారుగా నుంచగలరు. అట్లే ఖర్చులకు సంబంధించి సుమారు రుసుము పెట్టవలెను. ఒకచోట ప్రతి వస్తువు కొద్ది అద్దెకు గాని, కొద్ది ఖరీదుకు గాని లభించుటచే సంస్కారములు చేయించువారికి చాలా సౌకర్యము కలుగును. సమయము, శ్రమ కలిసివచ్చును. ప్రతి సంస్కారమునకు చిన్న చిన్న పుస్తకములు అచ్చువేయబడియున్నవి. కొందరు వ్యక్తులు వాటిని అనేక మారులు చదివి ఉచ్చారణ సరిచేసికొని ఎక్కడ సంస్కారము జరిగిన అక్కడ అనేకులు ఒకేసారి ఒకే స్వరముతో మంత్రోచ్చారణము చేయుచూ కర్మకాండను జరిపించిన వాటి స్వరూపము ప్రభావవంతమగును. సంస్కారముల యందు దక్షిణగా శాఖలకు లభించిన డబ్బుతో జనజాగరణ యొక్క సార్వజనిక కార్యములలో పెద్ద సహాయము లభించగలదు.

ఎవరైనా పూర్తి సమయమును ఈ పనిలో వినియోగించినచో వారు తమ కుటుంబ నిర్వహణలో కూడ ఈ విధముగా బ్రతుకుతెరువు సంపాదించుకొనగలరు. సంస్కార సమయములో ఆచార్యులకు కొంత దక్షిణ యిచ్చు పద్ధతి సర్వత్ర ఆచరణలో కలదు. ఈ ప్రతిఫలమును స్వీకరించుటకు సందేహించరాదు. ఎవరు తమ పూర్తి సమయము జనజాగరణకు పాటు పడుదురో, ఎవరికి వ్యక్తిగత సంపాదన లేదో, అట్టి యీ ప్రబోధకులు లక్షల

సంఖ్యలోనున్నను వారు జనజాగరణకు పూర్తిగా అంకితమై తమ బ్రతుకుతెరువు సమస్యను పూర్తిగా పరిష్కరించుకొనవచ్చును. నిజమైన శ్రద్ధ గల సంస్కర్తలొకవేళ ప్రతిచోట తయారుచేయగలిగిన వారి ద్వారా నవసమాజ నిర్మాణము ఒక్కింత కూడ కఠినము కాదు.

సంస్కారములు చేయించుకొను వారిపై అధికవ్యయభారము పడరాదు. యజ్ఞము మరియు పూజాసామాగ్రి యొక్క ఖర్చు పరిమితము కావలెను. ఇంటివారు, కుటుంబములోని వారు, చుట్టుప్రక్కల వారు, సంబంధీకులు, బంధువులు, పరిచయస్థులను తప్పక ఈ సందర్భమున ఒకచోట చేర్చి వారి సంఖ్య అధికముగా నుండు ప్రయత్నము చేయవలెను. అప్పుడు ఉత్సవము ముగిసిన తరువాత పంచామృతమును కొంచెము కొంచెము ప్రసాదముగా పంచవచ్చును. సంస్కారములలో స్వల్ప దక్షిణతో పని జరుగును. విధానము తక్కువ ఖర్చుతో కూడ పూర్తియగును మరియు ప్రవచనమునకు ఆర్థిక ఇబ్బంది కొంచెము కూడ కారణము కాదు.

**ఆచరణ తన ఇంటి నుండి :** ఈ ఆచరణ ముందు గాయత్రి పరివార్ శాఖల, సభ్యులు తమ నుండి ఆరంభించిన దాని ప్రభావము ఇతరులపై పడగలదు. మరియు వారు కూడ ఈ ఆకర్షణీయ ఉపయుక్త ధర్మకృత్యమును తమ వద్ద చేయించుట యందలి అవసరమును తెలిసికొనెదరు. ప్రతి ఇంటిలో సంస్కార సందర్భమున కొత్త కొత్త వ్యక్తుల కలయిక జరుగును. వారు ఎంత తక్కువ ఖర్చుతో, ఎంతో ప్రేరణాపూర్వకముగా, ఉపయుక్తముగా ఈ విధమైన ధార్మికకృత్యము ఏర్పాటు జరుగగలదో గమనించి తమ వద్ద కూడ ఆ ఏర్పాటును ఆలోచించెదరు. ఈ విధముగా సంస్కారములు చేయబడిన చోట్ల ఆ సమయములో అచటనున్న వారిలో అనేకులు తమ వద్ద కూడా అట్టి ఏర్పాటు చేయమని ప్రార్థించుట గమనించబడినది. ఎక్కడ ప్రజలు ఈ సంస్కారముల పట్ల ఉదాసీనులు లేదా అపరిచితులో అక్కడ వరదవలె ఇవి ఏర్పాటు చేయబడినవి. మరియు ఆ ప్రాంత ప్రజల ఆలోచన, పనులలో మార్పు సాధించుటలో మిక్కిలి సాఫల్యత లభించినది.



మనదేశము ధార్మికదేశము. ఇక్కడ ప్రతిపని ధర్మము సహాయముతో ఎంత బాగుగా జరుగగలదో అంతగా ఏ పద్ధతిలోను జరుగదు. స్వతంత్ర సంగ్రామము వరకు మనము మహాత్మాగాంధీకి, భారతమాతకు జయజయ ధ్వానములు చేసి రామరాజ్యమునకు సంబంధించిన కలలను కనుచూ జీవించితిమి. ప్రజల సహకారమునకు పెద్ద కారణము ఈ ఆధారమే. లోకశిక్షణ అను మహోన్నత కార్యము ధార్మిక వేదిక నుండియే చేయవలెను. ప్రజలు అధిక సంఖ్యలో ఒకచోట హాజరగుచూ, భావనాత్మక ఉత్సాహమును పెంచుకొనుచూ ఈ ఏర్పాట్ల ఖర్చును తామే భరించుటకేదేని ఆధారమును కనుగొనవలెను. ఈ మూడు విషయములే సంస్కార పరంపరల నాచరించుటకుచాలును. జనజాగరణకు ఇంతకు మించి ఉపయోగపడు సాధనము మరే విధముగాను లభించదు.

పూర్వకాలములో ఎంతో విస్తృతమైన కర్మకాండ ఈ సంస్కారముల సమయములో అమలు చేయబడుచుండెడిది. ఎంతో సమయము పట్టెడిది. ఎన్నో ఝంఝాటములుండెడివి. ఆ కారణముగా సర్వసామాన్యులకు పెద్ద ఇబ్బంది ఎదురయ్యేడిది. ప్రస్తుత ప్రణాళికను అనుసరించి దీనిలో కొంత మార్పు చేయబడినది. శాస్త్రీయ ఉద్దేశ్యములను పూర్తిగా రక్షించుచూ వాటిని సంక్షిప్తము, సరళము చేయుట జరిగినది. దానికితోడు వాటి ఉపయోగము, మహత్వము, ఆకర్షణలో లోటు రాకుండా శ్రద్ధ వహించబడినది. సంస్కారములను చేయించు ఆచార్యుల కర్తవ్యము అందమైన మండపము, యజ్ఞవేదిక, రంగురంగుల ఆసనములు, అలంకరించిన కలశములు, పతాకము, ఆదర్శ వాక్యములు, చిత్రములు మొదలగు వాటితో సంస్కార వాతావరణమును ఎంతో అందముగా, ఆకర్షణీయముగా తీర్చిదిద్దుట, వీటిలో పాల్గొను వ్యక్తులను కూడా తగిన స్థానములలో కూర్చోబెట్టి వారిచేత కూడ మంత్రోచ్ఛారణ, ఆశీర్వాదము, స్వస్తివాచనము, తిలకము, పూర్ణాహుతి మొదలగు పనులు చేయించుట జరుపవలెను. అట్లే వారుకూడ తమ సంస్కారముల ఏర్పాట్లలో భాగస్థులుగా భావించి చివరి వరకు తగిన స్థానములో నుండి పూర్తి విషయమును చూచి,

తెలిసికొనునట్లు చేయవలెను. ఎవరీ ప్రకారము భాగము పంచుకొందురో వారు సంస్కార ప్రణాళికా సమర్థకులే కాక ప్రచారకులు కూడ కాగలరు. మరియు వారి ద్వారా ఈ విధమైన పరంపర అమలుచేయు సౌకర్యము లభించును.

**ప్రభావోత్పాదక వాతావరణము :** సంస్కారములు చేయునపుడు దృశ్యము అలంకృతము. వాతావరణము తగినంత ఆకర్షణీయము కావలెను. వివాహ సమయములో చేసినట్లు నాలుగు గుంజలు పాతి, గుడ్డలు కట్టి, నీడకు డేరాను ఏర్పాటు చేయవచ్చును. కలశముతో అలంకరించిన వేదిక, దీపము, గాయత్రీ మాత యొక్క అలంకరించిన చిత్రము, దేవతల, మానవోత్తముల చిత్రములు, ఆదర్శ వాక్యములు, పతాకములు, తోరణములు మొదలైన వాటితో సంస్కారవేదికను చక్కగా అలంకరించవలెను. వాటిని రంగురంగుల ముగ్గులతో అలంకరించవలెను. యజమాని, యజమాని భార్యను ఉచిత ఆసనముపై కూర్చోబెట్టవలెను. బాలకుని సంస్కారము జరుగవలసియున్నచో తల్లిదండ్రులతో పాటు పిల్లవానికి కూడ కొత్తబట్టలు కట్టించవలెను. పూలగుత్తులు, చిన్న చిన్న పూలతోరణములు వేదిక ఎంతో చక్కగాను, సంస్కార వాతావరణము ఎంతో కాంతివంతము, ప్రభావశీలముగాను రూపొందును.

సంస్కారములలో పనికివచ్చు అన్ని వస్తువులను ఒకేసారి శాఖల నుండి తెచ్చి ఉంచుకొనవలెను. యజ్ఞసామాగ్రి, సమిధలు, యజ్ఞోపవీతము, నూలు, చందనము, ఆరతి మొదలైన అన్ని సామానులు సంస్కారము చేయించువారు చేకూర్చి యజమాని నుండి రుసుము స్వీకరించవలెను. పాలు, పెరుగు, నెయ్యి, పూలు, చిగురులు మొదలైన వాటిని ఆ సమయమునకు అవసరమైన వస్తువులు సంస్కార కార్యక్రమము ఆరంభించుటకు ముందే తెచ్చిఉంచినచో మధ్యలో ఏ ఆటంకము ఉండదు. **ఏ సంస్కారమును చేయించవలెనో దానికి సంబంధించిన పుస్తకములు కనీసము పది ప్రతులుండిన అక్కడ ఉన్నవారు ఒకే స్వరములో ఒకే లయలో మంత్రోచ్చారణ చేయగలరు.** ఈ విధమైన అందమైన పద్ధతి మొదటి నుండి యుండినచో సంస్కార కార్యక్రమము చాలా ఆకర్షణీయమైన ప్రభావమును కలిగించునది కాగలదు.



సంస్కరింపబడిన సమాజము యొక్క నూతన నిర్మాణము కొఱకు మనము సంస్కారములను ఆచరించవలెను. ఈ సాధనముతో జన సామాన్యమును దాని కర్తవ్యము, వివేకము, సద్భావములను ఆశాజనక పద్ధతిలో మేల్కొల్పవచ్చును. కర్మకాండలను ఋషులచే రచించబడిన అధ్యాత్మ విజ్ఞానమునకు సమ్మతమైన పద్ధతి ప్రేరణనిచ్చు ప్రవచనము ఉభయపక్ష ద్వారా తిరిగి సమస్త భారతదేశములో భావనలు వెలికితెచ్చినచో మనము వేగముగా ప్రాచీన గౌరవమును మరియు తేజస్సులను పొందగలుగుటలో సమర్థులగుదుము. ఇది నిశ్చయమని భావించవలెను.

సంస్కారముల ముఖ్యోద్దేశము ఆధ్యాత్మిక జీవితము ధార్మిక భావనలను పెంచుటయే. వివిధ ఇంద్రియ భోగముల వైపు మనుష్యులు తొందరగా ఆకర్షింపబడుదురు. మానవ స్వభావము యొక్క యీ బలహీనతలను చూచి మనీషులు సంస్కారములను నిర్మించి, అమలుచేసిరి. వారు మనుష్యులకు ధార్మిక కర్తవ్యములను ఎల్లప్పుడూ జ్ఞాపకము చేయనంతవరకు మనుష్యులు శీలరాహిత్యముతో అనైతికత వైపునకు పతనమొందెదరని భావించిరి. అందుకే వారికి మధ్యమధ్యలో సామూహికముగా కలిసి కూర్చొని ధార్మికచర్చలు చేయుటకు, ధార్మిక కార్యములు ప్రత్యక్షముగా ఏర్పాటు చేయుటకు అవకాశము కలుగవలెను. వాటినుండి ప్రేరణ లభించవలెను. సంస్కార విధానమును మనుష్యులు తమకు లభించు ప్రయోజనమును తెలిసికొని, సామాజిక సమ్మేళన రూపమున కొంత మానసికానందము కూడ లభించునట్లు తయారుచేయవలెను. ఎప్పుడైనా ఒక పిల్లవానికి సంస్కారము జరుగుచున్నచో దానిలో సాధారణముగా అందరు బంధువులు, చుట్టుప్రక్కలవారు పాలుపంచుకొందురు. ఆ సందర్భమున అందరు కలుసుకొను అవకాశము లభించును. దానికి తోడు కార్యక్రమము నిర్వహించు వ్యక్తి బుద్ధి కుశలతతో చేసినచో ప్రతి వ్యక్తికి మేలుచేయు శిక్షణ, ప్రేరణ లభించగలదు.

ఒకవేళ మనము ప్రాచీన గృహ్య సూత్రములలో పేర్కొనబడిన ఈ సంస్కారముల విధివిధానములు సూక్ష్మముగా అధ్యయనము చేసిన వాటి

యుద్దేశ్యము మనుష్యులు వాటి నుండి గృహస్థజీవితము, కుటుంబ జీవితము మరియు సామాజిక జీవితము కళ్యాణప్రదముగా జీవించు పద్ధతిని నేర్చుకొనగలుగుటయని తెలుసుకొందుము. **మధ్యకాలములో అజ్ఞానాంధకార యుగము వచ్చిన కారణముగా మనుష్యులు ఆ సంస్కారముల మహోన్నత ఆశయములను మరిచి మనోరంజనము, విందులు, వినోదము మొదలైనవే వాటి ప్రయోజనమని భావించిరి. వీటిలో వారి ఖర్చు పెరిగినది. కానీ లాభమేమియూ లేకపోయినది.** ఎంతోమంది మనుష్యులు సంస్కారములను అసౌకర్యములుగా భావించి మొత్తమునకే విడిచివేసిరి. కావున పాఠకుడు పై వివేచనతో సంస్కారముల నిజస్వరూపమును తెలిసికొని వాటిని ప్రభావవంతమగు పద్ధతిలో చేయుటకును తద్వారా దేశ, సమాజ, పునరుత్థానమునకు విలువైన సహాయము లభించుట నిశ్చయమనియు గ్రహించవలయును.

***

## సంస్కారాల పుణ్యపంరపరకు అనుబంధము

సంస్కారాల పునరుజ్జీవనంతో పాటు వాటిని ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా సంస్కరించిన గురుదేవులు శ్రీరామశర్మ ఆచార్య ఈ గ్రంథరచన తర్వాత మరొక రెండు సంస్కారాలను అదనంగా చేర్చారు. అవి (1) జన్మదిన సంస్కారం (2) వివాహదిన సంస్కారం. వీనితో కలిపి సంస్కారాల సంఖ్య పన్నెండయినవి.

**జన్మదిన సంస్కారం :** ఒక్కొక్క సంవత్సరం గడిచే కొద్దీ మనిషి మృత్యువుకు దగ్గరవుతున్నాడు. తాను ఎందుకు జన్మించాడో తెలుసుకోకుండానే సమయం సద్వినియోగం కాకుండానే జీవితం గడచిపోతున్నది. సార్థకమైన జీవితం గురించి ఆలోచించటానికి, పరిష్కారం కొరకు సంకల్పించటానికి జన్మదినం సరియైన రోజు. మనిషికి అందరికంటే తనకు తానే ప్రియం. అందుకే



అతని పుట్టినరోజు అన్నింటికంటే ప్రియమైనది. ఆరోజు "శ్రేయోపథంలో పయనించాలని, మహత్వాకాంక్షలు పరిమితం చేసుకుంటానని, పరమార్థమే స్వార్థంగా భావిస్తానని" సంకల్పిస్తే పతనం నుండి తప్పించుకోవటానికి వీలవుతుంది. దీపదానం ద్వారా దీపంలా జీవించటానికి సంకల్పించినట్లవుతుంది. జ్ఞానప్రకాశం, త్యాగం, స్నేహాలకు దీపం ప్రతీక. సార్థక జీవనానికి సంకేతం. ఆ రోజు ఏదైనా దుర్వ్యసనాన్ని వదలి, సత్సంకాల్పాన్ని నూతనంగా స్వీకరించుట ద్వారా ఉజ్జ్వల భవిష్యత్తు వైపు ప్రయాణిస్తాడు.

**వివాహదిన సంస్కారం :** వివాహం ధార్మికమైన కార్యక్రమమని తెలుసుకోకుండానే అజ్ఞానం, ఆడంబరాల మధ్య వివాహం జరిగిపోతున్నది. అర్హత, ఆశయాల ప్రసక్తి లేకుండానే పెళ్ళి జరిగిపోతున్నది. దాంపత్యజీవనం సుఖ సంతోషాలకు కాక గానుగెద్దు జీవితానికి, అన్నీ పిరికితనంతో భరించటానికి నెలవు అవుతున్నది. ఆత్మలను ఒకసారి తట్టి లేపి పెళ్ళినాటి ప్రమాణాలను ఒకసారి గుర్తుచేస్తే "పరస్పర సమర్పణ, గౌరవాలకు" ప్రతీకగా స్మరించుకొంటే జీవితంలో క్రొత్తదనం వస్తుంది. ఎవరూ ఎవరికంటే ఎక్కువ కాదని, ప్రేమించుటలో దివ్య ఆనందం ఉన్నదని ఈ వివాహ సంస్కారం గుర్తు చేస్తున్నది. అప్పటివరకు తమ అనుచిత ప్రవర్తన ద్వారా ఎంతో కోల్పోయిన సంగతి గ్రహిస్తే భవిష్యత్తులో, గతంలో జరిగిన పొరపాట్లు తిరిగి జరుగరాదని సంకల్పిస్తే ఉజ్జ్వల భవిష్యత్తు తథ్యం. తమ పిల్లలకు తామే ఆదర్శమని, చెప్పకపోయినా తమను అనుకరిస్తారని, నిత్యము గమనిస్తారని తెలిస్తే ఎంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలో అర్థమవుతుంది. కొంగు ముడిలో కట్టిన అయిదు మంగళ ద్రవ్యాలలో ఒకటియైన "గరిక" వలె తమ అనురాగం కొద్దిపాటి ప్రేమ జల్లులకే నవనవలాడాలని, కళకళలాడాలని గుర్తుచేసుకుంటే వివాహదిన సంస్కారం సార్థకమవుతుంది.

ప్రతి ఇంటిలో జన్మదిన సంస్కారం, వివాహదిన సంస్కారం ప్రతి యేటా జరుపుకోవాలని గురుదేవుల ఆకాంక్ష.

# శాంతి మంత్రం

సర్వే భవంతు సుఖినః సర్వేసంతు నిరామయాః

సర్వే భద్రాణి పశ్యంతు, మాకశ్చిత్ దుఃఖ భాగ్ భవేత్

ఓం శాంతిః శాంతిః శాంతిః

సమస్త ప్రాణకోటి సుఖులై యుందురుగాక !

అందరూ ఆరోగ్యవంతులై వర్ధిల్లుదురుగాక !

అందరికి మంగళ ప్రదమగుగాక !

ఏ ఒక్కరును దుఃఖమును చెందకుండెదరుగాక !

ఓం శాంతిః శాంతిః శాంతిః

*May whole creation be happy*
*May all living beings be healthy*
*May good alone happen to everyone*
*May none suffer sorrow*
*Om Shanti, Shanti, Shanthi*

ఓం ద్యౌం శాంతిః అంతరిక్షగ్ం శాంతిః

పృథివీ శాంతిః ఆపః శాంతిః ఓషధయఃశాంతిః

వనస్పతయః శాంతిః

విశ్వేదేవాః శాంతిః బ్రహ్మా శాంతిః

సర్వగ్ం శాంతిః శాంతిరేవ శాంతిః

సామాశాంతిరేధి, ఓం శాంతిః శాంతిః శాంతిః